# శశిలేఖాపహరణం

తండ్రి రచయితయితే థ్రిల్లేకాని, తల్లి రచయిత్రి అయితే హెల్లే! మా యింట్లో భాగోతం చూస్తున్నానుగా! అక్షరాల్లో రక్తం చిందించిన మహా మహా విప్లవ కవుల్నెరుగుదును. హృదయవిదారకంగా పేదల బాధలు గురించి విషాద గాథలు రాసిన రచయితన్ని ఎరుగుదును. ఏ మాటకామాటే చెప్పుకోవాలి! వాళ్ళు హాయిగా మందు పార్టీలు, విందు భోజనాలు ఆరగిస్తూ సాహిత్య సభలకెళ్ళి వాళ్ళ రచనల్లో శిల్పానికీ, భాషాప్రావీణ్యానికీ, భావావేశానికీ ప్రశంసలు, సన్మానాలు అందుకుంటూ కాలక్షేపం చేసేవారుకాని ఆ పీడిత ప్రజల్ని ఉద్ధరిస్తామంటూ టైం వేస్ట్ చేసుకుంటూ వాళ్ళ జీవిత సమస్యల్లో తలదూర్చలేదు.

మా అమ్మకీ అక్కర్లేని గొడవ లేదు. వృత్తిరీత్యా లాయర్. నవలలు, కథలు రాయడం ఆవిడకి పెళ్ళికాని క్రితం నుంచి వుందని, పాపం! మా నాన్నకి తెలీదు. ప్రయివేట్ కంపెనీలో చేరి కష్టపడి పైకొచ్చి, పనిలోపని ఆ కంపెనీ ప్రొప్రయిటర్కి ఏకైక సంతానమైన మా అమ్మని చూసేడుట. ఆమెని ప్రేమిద్దామనీలోపల మా అమ్మ మా నాన్నని చూసి వెంటనే మా తాతయ్యతో చెప్పి పెళ్ళాడేసిందట. తర్వాత మా నాన్నకి తెలిసిందట ఉమాదేవి అన్న రచయిత్రి మా అమ్మేనని. దరిమిలా ఉమారంగారావు పేరుతో రెండు పుంజీల నవలలు, నాలుగు డజన్ల కథలు రాసింది. ఇంకా ఆ పరిశ్రమ నిర్విరామంగా కొనసాగిస్తూనే వుంది. ఈ రోజున ఆవిడ పేరు ఆంధ్రదేశంలో నిరక్షరాస్యులకు సహితం తెలుసు. ఆవిడ రాసినవి చదవలేకపోయినా, వాటి తాలూకు సినిమాలైనా చూసుంటారు.

మా నాన్న కాస్త పేదకుటుంబంలోంచి వొచ్చేడేమో కాస్త డబ్బు జాగర్త మనిషి. మా అమ్మకీ డబ్బంటే నిర్లక్ష్యం. దానధర్మాలకి వెనకాడదు. స్త్రీల మీద అత్యాచారం, మానభంగాలు, వరకట్నాలు తాలుకు కేసుల్లో మా అమ్మకి రాబడికంటే ఖర్చే ఎక్కువంటాడు. మా నాన్నకి అమ్మన్నా, నేనన్నా, మా అక్కయ్యన్నా ప్రాణం. అమ్మ మాత్రం ఆవిడ లోకంలో ఆవిడుంటుంది. భర్తా పిల్లలు వున్నారన్న ధ్యాసైనా ఆవిడకుందా అనిపిస్తుంది.

మా అక్కయ్య గాయత్రి కాలేజి లెక్చరర్. కరాటే కూడా నేర్చుకుంది. మా బావ రాజారావు మా నాన్నలాగే నెమ్మదస్తుడు. మా అక్కయ్య పనిచేసే కాలేజ్‌లోనే హెడాఫ్‌ది డిపార్ట్‌మెంట్. ఆర్థిక ఇబ్బందులున్న మధ్యతరగతి కుటుంబంలోంచి వొచ్చాడేమో తరచు,

పెళ్లికాని క్రితం మా అక్కయ్య దగ్గిర డబ్బు అప్పు తీసుకునేవాడు. అతను అడగడానికీ, ఈమె ఇవ్వడానికీ. అతను అప్పు తీర్చకపోవడానికీ విసుగులేకపోవడంలో అంతరార్థం గ్రహించి ఓసారి మా అమ్మ వాళ్లిద్దర్నీ మా యింటికి పిలిచి, అతని చిల్లర అప్పులన్నీ తీర్చేసి అతని చెల్లెలు పెళ్లికి డబ్బు ఏర్పాటుచేసి, వెంటనే వీళ్లకి పెళ్లి చేసి ఇంక తీరుబడిగా ప్రేమించుకోమని వాళ్లచేత వేరే కాపురం పెట్టించింది. అది వర్ణాంతర వివాహం. మా నాన్న బాధపడ్డాడు. గత్యంతరంలేక ఒప్పుకున్నాడు. తర్వాత సమాధానపడ్డాడు. ఇప్పుడు సంతోషిస్తున్నాడు.

ఇంజనీరింగ్ కోర్స్ పూర్తవ్వగానే కంపెనీ బాధ్యతలు నాకు అప్పగించి నాకైనా మా అంతస్తుకు తగ్గ సంబంధం చూసి పెళ్లి చెయ్యాలని మా నాన్న ఆశయం. ఆ శుభసమయం ఆసన్నమైంది కనక ఆ ప్రయత్నంలో ఆయన వుండగా, మా అక్కయ్యో దుర్వార్త మోసుకొచ్చింది. అంతక్రితం రోజున మా అమ్మ మా బావని పిలిచి "ఏం రాజారావు! మన కిశోర్‌కి శశకళనిచ్చి పెళ్లిచేస్తే ఎలా వుంటుందంటావు!" అందిట. అది ప్రశ్నకాదనీ, ఆమె సంకల్పమనీ, అది నిర్వికల్పమనీ అనుభవం వున్నవాడు కనక మా బావ "బాగుంటుంది" అన్నాడట.

సదరు శశికళ నాలుగేళ్లుగా అమ్మ దగ్గిర పెర్సనల్ సెక్రటరీగా పన్జేస్తుంది. మా అమ్మకి దూరపు బంధువులమ్మాయి. ఇంటర్ పూర్తవ్వగానే మా యింటికొచ్చింది. ప్రైవేట్‌గా కట్టి ఎమ్మే పేసయింది. అందంగా వుంటుంది. బుద్ధిమంతురాలనే విన్నాను. నేను చదువురీత్యా సంవత్సరానికి పది నెలలు మరో వూర్లో వుండటంచేత ఎక్కువ పరిచయం లేదు. పైగా అమ్మకి దగ్గిర కాబట్టి దూరంగా వుండడం శ్రేయస్కరమనుకుంటూ వొచ్చేను. మరి ఇది ఎన్నడూ ఊహించని పరిణామం. పాపం! మా నాన్న చాలా అప్‌సెట్ అవుతాడు. మా అమ్మతో వాదించి ఒప్పించడం సులభం కాదు. ఆవిడకీ నాలుగు వేల 1/8 డెమ్మీసైజ్ పేజీల అనుభవం వుంది. వృత్తిపరమైన సరుకు కాక.

"కిశోర్‌కి పదిమంది వున్నవాళ్లూ, అచ్చటా ముచ్చటా తీర్చేవాళ్లూ, పరువు ప్రతిష్ఠ వున్న పెద్ద వాళ్లు, పిల్లనిస్తామని మన చుట్టూ తిరుగుతూ వుంటే ఈ దిక్కూ మొక్కూ లేని సంబంధమేమిటి! నువ్వెదురుతిరగాలి నాన్నా!" అంటూ నన్ను గురించి అక్కయ్య మా నాన్నతో అంది!

"పెళ్లి చేసుకునేవాడు కిశోర్. వాడు తిరగబడాలి. ఆ అమ్మాయిని చేసుకోనని చెప్పమను. నేను బ్రహ్మాండమైన సంబంధం సెలెక్ట్ చేస్తాను. అయినా తను ఇలా అనుకుంటున్నాను అని అంది కాని, అ అమ్మాయినిచ్చి పెళ్లి చేసేద్దామని నిర్ణయించినట్టు

రాజారావుతో అనలేదు కదా! అంచేత మన ప్రయత్నంలో మనం వుందాం. పైగా ఆ విషయం మన ముందరెత్తలేదు" అన్నాడు నాన్న.

అసలు ఈ నవలలు, కథలు చదివినా, సినీమాలు చూసినా మనకి తెలిసీదేమిటంటే ప్రేమించి పెళ్లి చేసుకున్నవాళ్లలో సుఖపడిన వాళ్లు అరుదని. అంతస్తులో, కులాలో, అభిరుచులో, అలవాట్లో, పెద్దల మనస్తత్వాలో, అపవాదులో, అనుమానాలో ఏవో ఇలాంటి రకరకాల కారణాలు కొన్నాళ్లయ్యేటప్పటికీ తీవ్రమైనసమస్యలుగా తలెత్తడం, దాంతో విడిపోడమో, ఆత్మహత్య చేసుకోవడమో, లేకపోతే అష్టకష్టాలు పడి చివర్నెప్పుడో ఆఖరి దశలో కలవడమో జరుగుతుంది. అంతేకాని ఆద్యంతం జీవితం సాఫీగా సాగదు. అయినా ప్రేమించడమనేది ఒకళ్లు నేర్పితే వొచ్చే విద్య కాదు. పైగా నేను ప్రేమిస్తే చాలదు. అవతలమ్మాయి కూడా సుముఖంగా వుండాలి కదా! లేకపోతే ఎంత రిస్కు, ఎంత అప్రతిష్ట, ఎంత డేంజరు! ఆ భయంతోనే సర్వజ్ఞులైన రచయితలు రచయిత్రులు ప్రేమించి పెళ్లి చేసుకోరనుకుంటాను! ఏది ఏమైనా నేనలాంటి ప్రయోగాలు చేయదల్చుకోలేదు. మా నాన్న మనసులో మూడు సంబంధాలు టిక్ పెట్టుకున్నానని చెప్పేడు. వాటిని గురించి లోపాయికారీగా వివరాలు సేకరించి సలహాయిస్తానంది మా అక్కయ్య. సరే అన్నాను. ఈలోగా, ఎందుకైనా మంచిదని, ముందు జాగ్రత్త కోసం బాగా ఆలోచించి గౌరవప్రదమైన భాషలో స్నేహపూర్వకంగా పెళ్లి విషంలో నేనింకా ఎటువంటి నిర్ణయం చేసుకోలేదు. మా అమ్మ బలవంత చేసినా నువ్వు అంగీకరించవద్దు అని శశికళకొక వుత్తరం రాసి పోస్ట్ చేసేను.

మా బావ మా అమ్మకి లిటరరీ ఫేన్. పైగా ఆవిడ సమగ్రజీవిత చరిత్ర కూడా రాసే ప్రయత్నంలో వున్నాడు. అంచేత నా పెళ్లి విషయంలో ఆ భక్తుడు కలగజేసుకోడని తెలుసు. మా అక్కయ్య చేసిన దర్యాప్తు ఫలితంగా తెలిసిందేమిటంటే మా నాన్న మనస్సులో వున్న మూడు సంబంధాలతో బాటు మరో ముప్ఫయి సంబంధాలు తాలూకు వాళ్లతో ఈ మధ్య "మా అబ్బాయికి శశికళనిచ్చి పెళ్లిచెయ్యాలనుకుంటున్నాం" అని మా అమ్మ చెప్పిందట. దాంతో అంతవరకు పిల్లనిస్తామని ముందుకు దుమికినవాళ్లు తోకలు ముడిచేరు. ఏతావాతా నా పరిస్థితి ఏమిటంటే పెద్దవాళ్లనుకున్నవాళ్లందరూ నన్నంటరాని వాణ్ణిగా జమకట్టేరు. మా అమ్మని కాదని పెళ్లికూతురు కోసం పత్రికలో బాక్స్ నెంబర్‌తో ప్రకటనివ్వడమా లేకపోతే అన్యథా శరణం నాస్తి అని శశికళనే పెళ్లాడటమా. అదీకాకపోతే ఇరానో, దుబాయో ఉడాయించడమా అన్న ఆలోచనలతో సతమతమవ్వడం మొదలుపెట్టేను. మా అమ్మ కోర్టుల్లోనూ, పత్రికల్లోనూ, సభల్లోనూ, బయటా మహిళోద్ధరణ

కార్యక్రమం జరుపుకుంటే జరుపుకోమనండి. నా వ్యక్తిగత స్వాతంత్ర్యాన్ని నిర్లక్ష్యం చేస్తూ ఆ ఉద్యమం ఇంట్లోనే కొనసాగిస్తే ఎవరు సంతోషిస్తారు! నేనా! మా నాన్నా! మా అక్కయ్యా!

గోరుచుట్టు మీద రోకలి పోటులాగ సరిగ్గా అదే సమయంలో శశికళ దగ్గిర్నుంచి నాకో వుత్తరం వొచ్చింది. చాలా క్లుప్తంగావుందా "బావా! నీ వుత్తరం అందింది. నా కంటే మంచి అమ్మాయి దొరికితే తప్పకుండా చేసుకో. మరీ ఆలస్యం చేస్తే నీ కోసం నేను వేచివుండను. త్వరపడు. లేకపోతే నేనూ నీ కంటే మంచివాణ్ణి వెతుక్కుంటాను. శశికళ."

అసలే మా హృదయాల్లో మండుతున్న అగ్గి మీద ఈ వుత్తరం గుగ్గిలం జల్లినట్లయింది. ఉత్తరం చూసిన నాన్నా, అక్కయ్యా కూడా "అమ్మ మీద తిరగబడి శశిని చేసుకోనని చెప్పు. మేమిద్దరం సపోర్ట్ చేస్తాం" అని హామీ ఇచ్చేరు.

నిత్యం ఎవళ్ల పనులు వాళ్లవి, ఎవళ్ల టైములువాళ్లవి అవడం వల్ల, ఎవళ్లకి ఎప్పుడు తీరికైతే అప్పుడుభోజన ఫలహారాలు చెయ్యడం పరిపాటి. ఒక్కఆదివారం మధ్యాహ్నం మాత్రం విధిగా అందరంకలిసి కబుర్లుచెప్పుకుంటూ తీరుబడిగా భోజనం చేస్తాము. ఈ రోజుశలవు కనక మా అక్కయ్య, బావ కూడా మా యింటికొచ్చి మాతోనే భోంచేస్తారు. అంచేత అందరం ఆదివారం లంచ్ కోసం ఉత్సాహంగా ఎదురుచూస్తూ వుంటాం. కాని ఈ ఆదివారం లంచ్ టైంలో మా అమ్మతో నా పెళ్లి విషయంలో వాదించి తాడో పేడో తేల్చుకోవాలన్న కృతనిశ్చయంతో వున్నాం కనక, ముఖ్యంగా నాకు గుండె దడగా వుంది. నేను రాసిన వుత్తరం శశికళ తెస్తుందో లేదో కాని శశికళ రాసిన వుత్తరం జేబులో పెట్టుకున్నాను.

ఆదివారం లంచ్ శుభఘడియ ఆసన్నమైంది. మేమ్ముగ్గురం కూర్చుని మా పాత్రోచితమైన సంభాషణలు రిహార్సల్ వేసుకుంటూండగా అమ్మ వచ్చింది. శశికళ ఎందుకో రాలేదు. దాంతో నా మనస్సు కాస్త స్థిమితబడింది.

"రాఘవుడికి కాలికిదెబ్బదగిలిందట. పాపం! పొలంగట్టున నడుస్తూ వర్షంలో జారి పడ్డాడుట. ఉత్తరం వొచ్చింది" అంది అమ్మ కూర్చుని.

"రాఘవుడెవరు?" మా బావ అడిగేడు. "మన శశి తండ్రి. స్వయానా మా పినతాతగారి మనవడు. నాకు సొంత తమ్ముడులాంటివాడు. చాలా ఉత్తముడు. మా భూములు చూస్తూ వుంటాడు. మొహమాటస్తుడు. మీ పెళ్లికొచ్చేడు. నువ్వుచూస్తే గుర్తుపడతావు. అక్కడ డాక్టర్‌కి చూపెట్టి కాలుకి ఫ్రేక్చరైందని అనుమానంగా వుంటే

వెంటనే టాక్సీ మీద యిక్కడికి తీసుకొచ్చెయ్యమని శశిని పంపేను" అంది అమ్మ. అందరం నిశ్శబ్దంగా వింటూ ఒకళ్ల మొహాలు ఒకళ్లు చూసుకుంటున్నాం.

"ఒకప్పుడు బాగా బ్రతికిన కుటుంబం. ఉప్పెనలో భూములు సముద్రంలో మునిగిపోయేయి. పాపం! వాడు అప్పుల్లో మునిగిపోయేడు. ఇప్పుడు సముద్రం మెరకేసి వీళ్లభూములు బయట పడుతున్నాయిట. అదృష్టం బాగుంటే వొచ్చేయేడు రొయ్యల పెంపకానికి గట్లెయ్యొచ్చుననుకుంటున్నారు. చూద్దాం. దేనికైనా కాలం కలిసి రావాలికదా!" అంటూ ఏకపాత్రాభినయం కొనసాగిస్తుంది అమ్మ.

"శశికళకి అక్కా చెల్లెళ్లులేరా?" అడిగేడు మా బావ, అమ్మ ధోరణికి శృతివేస్తూ.

"మా తమ్ముడికి ముగ్గురు కూతుళ్లు. కొడుకుల్లేరు. ఇద్దరి కూతుళ్లకి మంచి సంబంధాలేచేసేడు. దాంతర్వాత.." అమ్మ అంటుంటే. "ఉప్పెన వొచ్చి చితికిపోయేరు. మూడో కూతురు శశికళని తీసుకొచ్చి దగ్గిరెట్టుకుని నిలబెట్టింది మా అమ్మ" అంటూ అక్కయ్య అందుకుంది.

"అంత దగ్గిర బంధువులు కష్టంలో వున్నప్పుడు సహాయం చెయ్యడం విధాయకమే. మీ అమ్మే ఆదుకోకపోతే, పాపం! వాళ్ల అమ్మాయికి చదువు చెప్పించే స్థితిలో లేరు" అన్నాడు నాన్న. కాస్త అసలు అంశానికి దగ్గిర సంభాషణని మళ్లించే ప్రయత్నంలో.

"అలా సహాయం చెయ్యడంలో ఆ అమ్మాయికి అర్హత వుంది. అత్తయ్య గారికి పరమార్థం వుంది" మా బావప్రశంసించేడు భక్తిపారవశ్యంతో.

"అంతా పరమార్థం కాదు. అందులో నా స్వార్థం కూడా వుంది. నీతో చెప్పానుగా! శశిని కోడలుగా చేసుకోవాలన్నది నా వుద్దేశం" అంది అమ్మ.

"నీ కలాంటి ఉద్దేశం కలగడం సహజం అనుకో. అది ఉద్దేశమే అయితే ఫర్వాలేదు. మరి మా వుద్దేశాలు కూడా తెలుసుకుని నిర్ణయం చేసుకోవడం మనకీ మంచిది, కిశోర్‌కీ మంచిది" అన్నాడు నాన్న.

"అవును. అంతే ఇది కేవలం నా అభిప్రాయం. మీ అందరి అభిప్రాయాలూ తెల్సుకుని మీ అందరూ ఊc అంటే శశి అభిప్రాయం కూడా తెలుసుకుని అందరూ ఇష్టపడితే మా తమ్ముణ్ణీ, మరదల్నీ రమ్మని ముహూర్త పెట్టిద్దాం" అంది అమ్మ మా నాన్నకేసి చూడకుండా, నా కేసి చూస్తూ.

"అది కాదు, ఉమా! మనికి ఒక్కగానొక్క కొడుకు. వాడికేవో సరదాలుంటాయి. సిరిసంపదలు, పేరు ప్రతిష్ఠలు వున్న సంబంధాలన్నీ కాలతన్ని:..." మా నాన్న చెప్పడం మొదలుపెట్టేడు.

"రంగా! కిశోర్ పెళ్లికూతురు కాదు. మాట్లాడ్డానికి సిగ్గుపడుతున్నానుకోడానికి. వాడి తరఫున నువ్వెందుకు వకాల్తా పుచ్చుకుంటావు. ఇదిగో ఇలాగే వాడికివి కావాలి, అవి కావాలి అని ఊహించి కావల్సినవీ, అక్కర్లేనివీ అమర్చిపెట్టి గారాబం చెయ్యడం వల్లేవాడికి ఆత్మవిశ్వాసం కూడా పోయింది. ముందు వాణ్ణి మాట్లాడనియ్యి. తర్వాత మనం మాట్లాడుకుందాం. ఊ! కిశోర్... నీ అభిప్రాయం చెప్పు" అంది.

"అది కాదమ్మా! శశికళకి సహాయం చెయ్యదల్చుకుంటే లక్షో, రెండు లక్షలో ఆ అమ్మాయి పేర బేంక్‌లోవేసి వాళ్ల తాహతుకు తగ్గ సంబంధం...." అంటున్నాను.

"నేను శశికి సహాయం చెయ్యదల్చుకోలేదు" అంది అమ్మ.

"మరి నీ వుద్దేశం అదేకదా! నాన్ననేదేమిటంటే...."

"మీ నాన్న చెప్పిందివిన్నాను. నీ వ్యాఖ్యానం అనవసరం. నీ అభిప్రాయం చెప్పు. నువ్వుమరో అమ్మాయి నెవర్నయినా చూసి ప్రేమించేవా?"

"లేదు" అన్నాను.

"అది కాదమ్మా! వాడుమరో అమ్మాయిని చూసే అవకాశమే లేకుండా చేస్తున్నావు. వాడికి మరో సంబంధమేదైనా చూబెట్టేవా?" అక్కయ్యంది.

"నువ్వు రాజారావుని చూసేవు ప్రేమించేవు. నువ్వుమరో సంబంధమేదైనా మమ్మల్ని చూడనిచ్చేవా? వాడంతట వాడు పిల్లని చూసుకోలేదు. కనక ఆ బాధ్యత నేను తీసుకున్నాను" అంది అమ్మ.

"నాకు కట్నంకానుకలు అక్కర్లేదు. కనీసం పెళ్లయినా మన స్టేటస్‌కి తగ్గట్టు...." అంటూ నసిగేను. ఏం చెప్పాలో ఆలోచించుకుంటూ.

"వాడ్డూయూ మీన్! పెళ్లి జరుపుతున్నదినేను. నీ స్టేటస్‌కి, నీ బాబు స్టేటస్‌కీ లోటు రాకుండా నువ్వొద్దన్నా ఎవరూ యివ్వనంత కట్నం కానుకలు, లాంఛనాలు యిచ్చి పెళ్లిబ్రహ్మాండంగా జరిపిస్తాను. ఇంకా నీకేం కావాలి?" అమ్మ అడిగింది.

"మీ తమ్ముడి కూతుర్ని కిశోర్‌కిచ్చి పెళ్లిచేయడమేమిటి! ఏం కావాలో నిన్నడగడమేమిటి! అంటే నీ కొడుకు పెళ్లికి నువ్వే కట్నకానుకలు యిచ్చి ఖర్చులు కూడా పెట్టుకుని పెళ్లి చేస్తావా?" అడిగేడు నాన్న ఆశ్చర్యంగా.

నేనూ మా అక్కయ్యా వెర్రిమొహాలేశాం. మా బావ మాత్రం చిరునవ్వు నవ్వుకుంటున్నాడు.

"భేషుగ్గా! ఇంకా మన కెందుకయ్యా ఇతరుల సొమ్ము. మనకున్నదల్లా వీళ్లిద్దరూ. ఉన్నది చాలదా! ఇంకా నువ్వు సంపాదిస్తున్నావు, కొద్దో గొప్పో నేనూ సంపాదిస్తున్నాను. ఇప్పుడు వీడూసంపాదన మొదలెట్టేడు. ఇది చాలక యితరుల దగ్గర చెయ్యి చాచాలా. మనం తినక, ఇతరులకి పెట్టక, పిల్లలకి మూటకట్టి యివ్వడం వాళ్లని అసమర్థులకింద భావించడం అవుతుంది."

"యద్భావం తద్భవతి" అని చివరికి అంతే అవుతుంది. ఇదా మనం వీళ్లకిచ్చే ఆశీర్వచనం."

"ప్లీజ్! ఉమా! నీ వేదాంతం తర్వాత వింటాను. ఆల్‌రైట్ నీ యిష్టమొచ్చినంత డబ్బు ఖర్చుపెట్టి ఆ అమ్మాయికి మరో మంచిసంబంధం చూసి"నాన్నన్నాడు.

"నేనాలోచిస్తున్నది శశికి మంచి సంబంధంగురించి కాదు. మనవాడికి మంచి సంబంధం గురించి" అమ్మ అంది మాటల్లో ఆవేశం లేకుండా.

"అంటే యింతకంటే మంచి సంబంధం వీడికి దొరకదా!" అక్కయ్యంది.

"తల్లకిందులుగా తపస్సు చేసినా దొరకదు." అంది అమ్మ శాంతంగా.

"నాన్‌సెన్స్!" అన్నాడు నాన్న ఆవేశంలో.

"రంగా! ఆవేశపడకు. ఇది మన కుటుంబ విషయం. శాంతంగా మాట్లాడుకుందాం. నేను చెప్పేదాంట్లో తప్పుంటే నీకు క్షమాపణ చెప్పుకుంటాను" అంది అమ్మ.

"నేను వుండొచ్చా?" మా బావ అడిగేడు లేవబోతూ.

"నువ్వు పరాయివాడివనుకుంటే వెళ్లిపోవచ్చు" అంది అమ్మ. బావ కిక్కురుమనకుండా చతికిలబడ్డాడు.

"సారీ ఉమా! నీది అర్థంలేని వాదన. ఎన్ని మంచి సంబంధాలో వొస్తుంటే...."నాన్నంటున్నాడు.

"ఎందుకు కట్నం యిచ్చి పిల్లని తెచ్చుకోవల్సినంత అవసరమేమొచ్చింది!" అక్కయ్య పూర్తిచేసింది.

"ఎవ్విరిథింగ్ దేర్ఈజ్‌ప్రయిస్. మంచి వస్తువు కొనాలనుకున్నప్పుడు దాని వెల చెల్లించాలి. అలాగే మంచి కోడలు కావాలనుకుంటే..." అంది అమ్మ మమ్మల్ని కవ్వించే ధోరణిలో.

"మంచి కోడలంటే?" అడిగేను. ఇక ఊరుకోదల్చుకోలేదు.

"మంచికోడలంటే మీ అమ్మకి ఫుల్ టైం సెక్రటరీ, నీకు పార్ట్‌టైం వైఫ్!" నాన్న నిర్వచించేడు.

"ఆల్‌రైట్ నువ్వే చెప్పు. నీ కెలాంటి అమ్మాయి కావాలో. అందంగా వుండాలి. అవునా?" అమ్మ నా వైపు తిరిగి అడిగింది.

'ఊ' అన్నాను.

"చదువు సంస్కారం వుండాలి. ఆరోగ్యంగా, చలాకీగా నవ్వుమొహంతో వుండాలి"

'ఊ' అన్నాను. 'నీలాగ' అంటే బాగుండదని.

"డబ్బుంది కదాని షోకులు, ఫేషన్లు, పార్టీలు అంటూ ఆడంబర ప్రదర్శనలు వుండకూడదు సరే" అన్నాను.

"మన ఇంటి గౌరవ మర్యాదలు కాపాడే బుద్ధిమంతురాలై వుండాలి."

'ఊ' అన్నాను.

"భర్తని, భర్త అభిరుచుల్ని గౌరవించేదై వుండాలి!"

"చాలు. ఇంకేం కావాలి?" అన్నాను.

"మరి ఈ లక్షణాలన్నీ శశిలో వున్నాయి. నాకు, తెలుసు. నీ కోసం నాలుగేళ్ల క్రితమే తీసుకొచ్చి నా దగ్గర పెట్టుకుని తర్ఫీదిచ్చేను. పెళ్లయ్యేక నీకు భార్యగానే వుంటుంది. నాకు సెక్రటరీగా వుండదు. మీరు వేరే కాపురం పెట్టుకుని స్వతంత్రంగా వున్నా సంసారం సమర్ధవంతంగా చక్కదిద్దుగోగల బుద్ధిమంతురాలు...." ఏమిటో అమ్మ అప్పుడే శశి తన కోడలైపోయినట్టు ఒకటే తన్మయత్వం!

"ఎంత బుద్ధిమంతురాలో ఈ వుత్తరం చూస్తే నీకే తెలుస్తుంది" అంటూ ఉత్తరం పట్టుకుని చెయ్యి జాపేను. అమ్మ అందుకోలేదు.

"ఉత్తరం తీసుకు చదువు. భర్తని ఎంత గౌరవించగల సంస్కారం వుందో తెలుస్తుంది" అంది అక్కయ్య.

"ఏమిటి! వుత్తరం వుత్తరం అంటూ ఒకటే రభస!" అంది అమ్మ, ఉత్తరం అందుకునే ప్రయత్నమైనా చెయ్యకుండా.

"డేమిట్! ఉత్తరం తీసుకుచదవకుండా అలా విసుక్కుంటావేమిటీ! ఎంత పొగరుబోతు సమాధానమిచ్చిందో చూడోసారి" నాన్నన్నాడు.

"దేర్ యు ఆర్! రంగా! అది వుత్తరం కాదు. ప్రత్యుత్తరం. అది కిశోర్ వుత్తరానికి శశి రాసిన జవాబని మీ అభిప్రాయం అవునా?" అమ్మ అడిగింది.

"అవునో కాదో చూడు నీకే తెలుస్తుంది ఆ దస్తూరి శశిదే, నాకు తెలుసు" అంది అక్కయ్య.

"అసలు నేను వుత్తరం రాసినట్లు నీ కెలా తెలుసు? అది జవాబు కాదంటున్నావు!" అడిగేను శశికళ నా ఉత్తరం అమ్మకి చూపెట్టిందన్న మాట.

"ఆ వుత్తరం శశి నీకు రాసింది కాదు. శశి ఇంట్లో లేనప్పుడు పోస్ట్ వొచ్చింది. శశి పేర నీ దస్తూరితో ఎడ్రస్ వున్న వుత్తరం కనబడింది. తల్లిగా స్వతంత్రించి కవర్‌ని చింపి వుత్తరం చదివేను. నేనా వుత్తరం శశికి ఇవ్వలేదు. నీ వుత్తరం సంగతి శశికి తెలియదు. ఆ వుత్తరం నేను డిక్టేచేస్తే శశి రాసిన, కథలో భాగం. సగంలో తీసేసుకుని నేను తర్వాత పూర్తి చేస్తానని చెప్పిదాని మీద శశి సంతకం పెట్టి, నీ అడ్రస్ టైప్ చేసిన కవర్‌లో పెట్టి పోస్ట్ చేసేను" అంది అమ్మ. నలుగురం తెల్లమొహాలు వేశాం.

"అమ్మా! నా మీదే నీ రచన ప్రయోగిస్తావా?" అడిగేను.

"కట్టుకున్న మొగుడుతో కాని, కన్నకొడుకుతో కాని, కూతురుతోకాని ఇలా యిలా ఆలోచించేను. ఇలా చేస్తే బాగుంటుంది. అని ఒక్క మాటైనా చెప్పేవా?" నాన్న తన అక్కసుని వెళ్లగక్కేడు.

"మీకు ఆవేశం ఎక్కువ. రాజారావు నిశితంగా ఆలోచించగల సమర్థుడని, అతనితో సంప్రతించేను. భేష్ అన్నాడు. మీకు చెబుతాడని నాకు తెలుసు. నేను మీ అందరికీ చెబుదామనీలోపుగా కట్టకట్టుకుని నా మీద విరుచుకుపడ్డారు. వీడు ఉత్తరం రాయడమెందుకు! నాకు చెప్పొచ్చుగా! పిరికి సన్యాసి!" నేనూ, అక్కయ్య తలలు దించుకున్నాం.

"వీడికి సంబధాలొస్తున్నాయని తెలిసీ ఎందుకూరుకున్నావు. ఎన్ని సంబంధాలొచ్చాయో తెలుసా?" నాన్న నిలదీసి అడిగేడు.

"పెద్దసంబంధాలతోబాటు చచ్చు సంబంధాలు కూడ వొచ్చాయి. అలాంటి సంబంధాలు అంత ధైర్యంగాఎందుకొచ్చాయో తెలుసా?" అమ్మ అడిగింది.

"వర్ణాంతరవివాహంచేసుకున్న కుటుంబం అని లోకువ కట్టి" బావ అన్నాడు. ఈసారి నాన్న కూడా తల దించుకుని మౌనంగా ఆలోచనలో పడ్డాడు.

భోజనాలకి కూర్చుని అరగంటయింది. కంచాల్లో అన్నీ వొడ్డించుకున్నాం. ఈ సంభాషణల్లోపడిఅన్నం కెలుకుతున్నాం. కాని ఎవళ్లంఓ ముద్దయినా నోట్లో పెట్టుకోలేదు.

అమ్మ మొహంలో సహజమైన వ్యంగ్యధోరణి, చిరునవ్వు లేవు. గాంభీర్యం చోటుచేసుకుంది. నేప్‌కిన్‌తో చేతులు తుడుచుకుని లేచి, మేము కంగారుపడుతూండగా, నాకూ, నాన్నకీ మధ్య వున్న ఖాళీ కుర్చీలో కూర్చుని నాన్న భుజం మీద చెయ్యి వేసింది. నాన్న తలెత్తి అమ్మ మొహంలోకి చూసేడు.

"ఇన్నాళ్లూమనం కలిసి జీవించినా, నీ వ్యాపారం తాలూకు కిటుకులు మాత్రం నాకు బోధపడలేదు" అన్నాడు నాన్న తన భుజం మీద వున్న అమ్మ చేతి మీద తన చెయ్యి వేసి అమ్మ మొహంలోకి చూస్తూ.

"రంగా! ఏంచేసినా మనిద్దర్నీ దృష్టిలో పెట్టుకునీ చేసేను. నువ్వుజ్ఞాపకం తెచ్చుకో. నా నిర్ణయాల్ని కాస్త ఆలస్యంగా మెచ్చుకోవడం నీకు అలవాటు. మొదట్లో గాయత్రి రాజారావుల పెళ్లికినువ్వు సుముఖంగా లేవు. బాధపడ్డావు. అవునా?"

"అప్పట్లో అవును. ఇప్పుడు కాదు. అప్పట్లో మన బంధువులే చాలామంది వ్యతిరేకించేరు. మన కుటుంబం అప్రతిష్ఠపాలవుతుందని బెదిరించేరు." నాన్న ఒప్పుకున్నాడు.

"మరి ఆ బంధువులే ఇప్పుడు మన కిశోర్‌కి పిల్లనిస్తామంటూ ముందుకొచ్చేరు. ఏంచేతనంటావు? మన ప్రతిష్ఠ మీద వాళ్ల అభిప్రాయం మారి కాదు. మన ఐశ్వర్యం చూసి. మనం గౌరవించే మానవతా విలువలను గుర్తించలేని కుటుంబంలో పిల్లనికోడలుగా తెచ్చుకుంటే, మన చివరి రోజుల్లో మనింట్లో మనమే పరాయివాళ్లమయ్యే ప్రమాదం వుంది. అరమరికలు లేకుండా మనతో మన బిడ్డలాగ కలిసిపోయే కోడలు, అవసరం. రంగా! శశి మనకి కోడలే కాదు, మరో కూతురుగా వుంటుందని ఆలోచించేను. నీ సంతోషం నా సంతోషం కాదా?" అంది అమ్మ.

అక్కయ్య, బావ మొహాలు సీరియస్‌గా వుండడం చూసి తలెత్తి అమ్మ మొహంలో చూశాను. ఒక కన్నీటి బిందువు అమ్మ చెంప మీద జారుతూ కనబడింది. నాన్న వెంటనే ఒక పూరీ ముక్కతుంచి కూరతో కలిపి అమ్మ నోట్లో పెట్టేడు.

"మరి నా పెళ్లి సంగతేమిటి?" అని అడిగేను నవ్వుతూ. అమ్మ భుజం పట్టుకు కుదుపుతూ. అమ్మ తన నోటికేసి చూపెట్టింది. "మరింకో మాట మాట్లాడితే నిన్ను కూడా నమిలి మింగేస్తానంటుంది" అని నాన్న వ్యాఖ్యానిచేడు.

* *ఆంధ్రజ్యోతి, 1987 దీపావళి సంచిక*